కథానిక

# తుంటరి అభాగ్యుడు

కొమ్మూరి వేణుగోపాలరావు

కాఫీగ్లాసు చేతికియిస్తున్న భార్యకళ్లలోకి చిలిపిగా చూస్తూ ఆమె బుగ్గమీద చిటికె వేశాడు రామకృష్ణ.

చేతికిస్తున్న గ్లాసు బల్లమీద పెట్టి "వేళా పాళా లేకుండా ఏమిటీ చిలిపిచేష్టలు ఎవరన్నా చూస్తారేమోనని బిడియమన్నా లేకుండా" అంది బుంగమూతి పెట్టి నిర్మల.

"ఎవరు చూస్తారేమిటీ"

రామకృష్ణ యీమాటలు చటుక్కున అనేసినా తను కిటికీముందు కూర్చుని వున్నాననే విషయం గుర్తుకువచ్చి అనుమానంగా బయటకి చూశాడు. రోడ్డుమీదమాత్రం ఎవ్వరూ జనం లేరు. కాని ఎదురింటి కిటికీ వెనక నిల్చుని తమ వంక తదేకదీక్షతో చూస్తున్న అతన్ని చూడగానే రామకృష్ణకి అరికాలిమంట నెత్తికెక్కింది.

రోజూ యిదే వరస. ఆ ఎదురింటి అతను యిక్కడికి కొత్తగా వచ్చాడు. వచ్చి వారం రోజులుకూడా దాటలేదు. కాని అతని కళ్లు మాత్రం ఎప్పుడూ తనమీద, తన భార్యమీద వుంటాయి. కళ్ళు కరవుతీరేటట్లు చూస్తూంటాడు ఎప్పుడూ. అతను వచ్చిన రోజునే యీ విషయం కనిపెట్టేశాడు తను మొదట వాళ్లు ఆ ఇంట్లో దిగడంచూసి, ఎవరో మర్యాదస్తులు, ఎదురెదురు వాళ్లం కాబట్టి స్నేహంగా వుండవచ్చు అని అనుకున్నాడు కూడా. కాని ఆ సాయంత్రమే తన వూహ అబద్ధమయిపోయింది. డాబా మీద పిట్టగోడవద్ద తనూ, నిర్మలా నిల్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అంతలో క్రొత్తగా వచ్చిన అతను గుమ్మం ముందు నిల్చుని తమవంక చూడసాగాడు. మొదట మామూలుగా చూస్తున్నాడేమో ననుకుని ఏమీ అనుకోలేదు తను. కాని అతను ఎంతసేపటికీ అక్కడినుంచి కదలక మొదటిలాగే ప్రవర్తించటం చూసి విసిగేసి నిర్మలను తీసుకుని క్రిందకు వచ్చేశాడు. అతను మర్యాదస్తుడు కాదు, తుంటరి అని అప్పుడే ఖాయమయిపోయింది. ఒక విధమైన ద్వేషం కూడా కలిగింది అతనిమీద, అప్పటినుంచీ అతనికిది రోజూ పరిపాటయిపోయింది. తను ఏ విధంగా యీ విషయం అతనితో చెప్పగలడు?

"ఏమిటి? ఆలోచిస్తున్నారు?"

రామకృష్ణ తలయెత్తి నిర్మలవంక చూశాడు.

"ఏమీ లేదు."

"ఇవాళ సరస్వతిలో మంచి పిక్చరు వుంది పోదామా?" అని అడిగింది నిర్మల.

నిర్మల ఏదడిగినా కాదనలేడు రామకృష్ణ. సరేనన్నాడు

ఆ సాయంత్రం యిల్లు తాళంపెట్టి బయలుదేరారు యిద్దరూ సినిమాకి.

"నడిచే పోదాం కబుర్లు చెప్పుకుంటూ" అన్నాడు రామకృష్ణ.

అతనికి వెంటనే ఏదో అనుమానం కలిగింది. వెనక్కి తిరిగి తమ ఎదురింటివైపు చూశాడు. అనుకున్నంతా అయింది. అప్పుడే మెట్లు దిగుతున్నాడు అతను. తమ వెనకనే వస్తాడు కాబోలు. అయినా ఒకడికి జడిసి ఆనందాన్ని భగ్నం చేసుకోవటం ఏమిటని నిర్మలతో మాట్లాడుతూ నడిచిపోసాగాడు రామకృష్ణ.

రెండు రూపాయిన్నర టిక్కెట్లు తీసుకుని హాలులోకి పోయి కూర్చున్నారు యిద్దరూ. సినిమా యింకా మొదలు కాలేదు. తమని అనుసరించి వచ్చిన వ్యక్తి అంతటితో వెనక్కి వెళ్ళిపోయాడా లేక హాలులోకికూడా తయారయ్యాడా అని రామకృష్ణ అనుకుంటూవుండే లోపల కిల్లీ నముల్తూ, చేతిలో సిగరెట్టు పెట్టుకుని లోపలికి వచ్చి కుర్చీలన్నీ ఓసారి కలియచూశాడు ఆదేవ్యక్తి. రామకృష్ణ హృదయం భగభగమని మండిపోతోంది. 'చూస్తూవుండ

గానే అతను వచ్చేసి నిర్మల ప్రక్కనవున్న కుర్చీలో కూర్చున్నాడు.

నూతన వ్యక్తి ప్రవర్తన చూసి తెల్లబోతూ భర్త ముఖంలోకి చూసింది నిర్మల. పాపం ఏమీ అనలేకపోయాడు రామకృష్ణ.

అసలతను ఎవరు? తన భార్యవంక ఎందుకంత దీక్షగా చూడటం? పైగా సినిమాకికూడా వచ్చి ఆమె ప్రక్కన కూర్చుని అంత మోటుగా ప్రవర్తిస్తాడేం? అతనుకూడా ఒంటరివాడు కాదు. భార్య వుండికూడా పరాయిదాన్ని, అందులోనూ ఎదురింటివాడి భార్యను- అలా వెర్రిగా చూస్తాడేం? అయితే యితన్ని ఏమిటీ చెయ్యటం? చీవాట్లు పెడితే! అతను ఎదురు తిరిగినా తిరగొచ్చును. పోనీ ప్రక్కయింటి పెద్దమనుషుల్ని అయిదారుగుర్ని తీసుకుపోయి బుద్ధి చెప్పిస్తే? బాగానేవుందిగాని "నేను ఆమెను ఏమిచేశాను? ఆమెవంక చూశానన టానికి రుజువేమిటి?" అని అతను మొండి సమాధానాలు చెప్తే తను మాట్లాడేందుకు కూడా ఏమీ ఆధారం దొరకదు.

రామకృష్ణ యీఆలోచనల్లో వుండగానే లైట్లారిపోయాయి. చీకటి. భార్యను అటు కూర్చోబెట్టి తను అటు కూర్చోవాలనుకు న్నాడు. ఆమెతో ఎలాచెప్పటమా అని తట పటాయిస్తూ వుండగానే నిర్మల "నేను అటు కూచుంటాను" అన్నది. తను వాంఛిస్తున్నది కూడా అదే. ఆమెను యిటువైపు కూర్చోబెట్టి తను ఆ తుంటరివ్యక్తి ప్రక్కన ఆసీనుడయాడు.

రామకృష్ణ యింటర్వెల్‌లో ఒక విషయం కనిపెట్టాడు: తన ప్రక్కనవున్న అతను తనతో ఏదో మాట్లాడాలని ప్రయత్నించటమూ, మళ్ళీ ఏదో అనుకుని వూరుకోవటమూ గ్రహించాడు.

మరునాటి ఉదయం ఎనిమిది గంటలకి యీజీచైర్‌లో కూర్చుని పేపరు చదువుకుంటు న్నాడు రామకృష్ణ.

అంతలో బయట అడుగుల చప్పుడు వినిపించింది. తలయెత్తి చూచాడు. ఎదురింటి అతను నిల్చుని వున్నాడు. రామకృష్ణకి ఏమిచేయటా నికీ పాలుపోలేదు. తన విరోధి అనుకుంటున్న వ్యక్తి అకస్మాత్తుగా తనయింటికే రావటంతో కొంచెం చకితుడయ్యాడు.

"కూర్చోండి" అన్నాడు కుర్చీనిచూపిస్తూ.

అతను నమస్కారంచేసి కూర్చున్నాడు. రెండు నిమిషాలవరకూ ఎవ్వరూ మాట్లాడలేదు.

"నాపేరు ముకుందరావు, మొన్ననే యీ వూరికి ట్రాన్సుఫర్ అయి వచ్చాను." అన్నాడు అతనే ముందుగా.

రామకృష్ణకేం మాట్లాడటానికి తోచక వింటున్నాడు.

"ఇక్కడికి వచ్చినరోజునే నన్ను చకితుడ్ని చేసివైచిన పరిస్థితి ఒకటి తారసిల్లింది. అప్పటి నుంచీ మిమ్మల్ని పరిచయం చేసుకోవాలని అభిల షిస్తున్నాను. కాని తటపటాయిస్తూ యింత వరకూ వూరుకుండిపోయాను."

రామకృష్ణకి అతని ధోరణి ఏమీ అర్థం కాలేదు. నాటకం ఆడుతున్నాడేమో నని పించింది.

"ఏమిటి?"

రామకృష్ణ కళ్ళలోకి చూస్తూ ముకుంద రావు అన్నాడు. "అసలు విషయం చెప్పే ముందు మీతో నా స్వంతకథ మనవి చేసుకో వాలి. మీ కభ్యంతరం లేకపోతే..."

"చెప్పండి" అన్నాడు రామకృష్ణ.

"ముకుందరావు చెప్పసాగాడు. "మేము మునుపు కాకినాడలో వుండేవాళ్ళం. మేము అంటే నేను, నా భార్య, నా చెల్లెలు వసంత. వసంత అంటే ఎక్కడలేని అభిమానం నాకు.

నా తల్లిదండ్రులు చిన్నప్పుడే మరణించారు. అప్పటినుంచీ వసంత నా చేతులమీదు గానే పెరిగింది. ఆమె స్కూల్ చదువు ముగిసిన తర్వాత కాలేజిలో ప్రవేశపెట్టాను. ఇక్కడే పరిస్థితులు తారుమారయాయి. కాలేజీలో చదువుతున్న వసంత తనక్లాసే చదువుతున్న ఒక యువకుడ్ని ప్రేమించింది. తన ప్రేమ విషయం నాకు వెల్లడించింది కూడాను. అయితే ఆ అబ్బాయి బీదవాడు. అంతే కాదు. అన్యకులస్థుడు. నేను ఏవిధంగానూ యీ సంబంధాన్ని అంగీకరించలేకపోయాను. నా చెల్లెల్ని పోషించటానికికూడా అసమర్థుడు అయినవాడికి యివ్వటమా? వద్దని ఆతర్వాత మంచి సంబంధం ఒకటి ఖాయపరచాను."

ముకుందరావు ఒక క్షణం ఆగి చెప్పాడు తిరిగి: "మరునాడే పెళ్ళి. ఆ రోజు రాత్రి అంతా నిద్రపోయిం తర్వాత బావిలో పెద్ద చప్పుడు వినిపించింది. కంగారుగా లేచి వెళ్ళి చూశాము. అప్పటికే అంతా మించిపోయింది. వసంత చనిపోయింది. నేను ఎంతగా ఏడిచానో చెప్పలేను. నా కఠినత్వానికి నన్ను నేను నిందించుకున్నాను. కాని ఏంచేసేది? అతనితో సంబంధం వద్దు అని చెప్పింతర్వాత మాట్లాడకుండా వూరుకుంది గాని అతన్ని యింత గాఢంగా ప్రేమించానని చెప్పలేదు. ఆమెమనస్సులో యిలాంటి వుద్దేశం పెట్టుకుందని నాకేం తెలుసు? ఏమయితేనేం, ఆమె చ...ని ..పోయింది."

ముకుందరావు గొంతు బొంగురుకు పోయింది. కళ్ళవెంబడి ముత్యాలు లాగా నీళ్ళు కారసాగాయి. పరిస్థితి అంతా చూసి తెల్లబోయారు, రామకృష్ణ. అతనికి తనతో పరిచయం చేసుకోవలసిన అగత్యం ఎందుకు ఏర్పడిందో అర్థంకావలేదు యింతకీ.

ముకుందరావు జేబులోంచి ఒక ఫొటో తీసి రామకృష్ణకి యిచ్చాడు, చూడండి అంటూ.

రామకృష్ణ చకితుడయ్యాడు. ఆ ఫొటోలో వున్నది తన భార్య నిర్మల కాదు గదా!

"ఆమే నా చెల్లెలు వసంత. అప్పటినుంచీ చేసిన తప్పుకు కుమిలిపోతూ ఆ ఫొటోను చూసే సంతృప్తిపడుతున్నాను. ఇప్పటికయినా మీకు అసలు విషయం అర్థమయి వుంటుందనుకుంటాను. మొదటిరోజున యిక్కడికి వచ్చేటప్పటికి మీ భార్య కనిపించింది. అచ్చంగా నా చెల్లెలులా వున్న ఆమెను చూసి నేను విస్మయం చెందాను. అప్పటినుంచీ మీతో పరిచయం చేసుకోవాలని, ఆమెను నా సోదరిగా భావించి తన్మయం చెందాలని వూహ నాలో మెసల్తూవుంది. అది యీనాటికి ఫలించింది" ముకుందరావు ఎంతో ఆవేదనతో చెప్పాడు.


(ESTD: 1907)



దక్షిణ ఇండియాలో ముఖ్యమైన చోట్లన్నిటిలోను బొంబాయిలోను బ్రాంచీలు కలవు.

| | | |
|---|---|---|
| చందా వేసిన మూలధనము | ... | రు. 72,00,000 |
| చెల్లించిన మూలధనము | ... | రు. 53,00,000 |
| రిజర్వు ఫండ్ | ... | రు. 62,00,000 |

అన్ని విధములయిన బ్యాంకింగ్ వ్యాపారములు చేయబడును.

ఎస్. గోపాల అయ్యర్, సెక్రెటరీ.

ఇండియన్ బ్యాంక్ లిడ్.,
హెడ్డాఫీసు : మదరాసు

రామకృష్ణకి కూడా కళ్లు అశ్రుపూరితాలయాయి. తను తుంటరి అనుకున్న వ్యక్తి ఎంతటి పవిత్రమైన హృదయం కలవాడు!

అతను పిలిచాడు "నిర్మలా!"

లోపల ఏదో పనిలో వున్న నిర్మల ముందు గదిలోకి వచ్చింది. నూతన వ్యక్తిని చూసి లోపలకు పోబోయిందిగాని "పర్వాలేదు నిర్మలా. ఇతను మీ అన్నయ్య" అని రామకృష్ణ అనేటప్పటికి తెల్లబోయి ఆగిపోయింది. రామకృష్ణ ఆమెతో సంగతంతా చెప్పేటప్పటికి ఆశ్చర్యంలోంచి తేరుకుని సంతోషంగా చిరునవ్వు నవ్వింది.

"అన్నట్టు మీ అన్నయ్యకు కాఫీ తీసుకురా నిర్మలా" అన్నాడు రామకృష్ణ.

కాని ముకుందరావు లేస్తూ "వద్దు నేను యింట్లో పుచ్చుకునే వచ్చాను. ఆనక ఒకసారి మా యింటికి రా చెల్లీ, వదినతో మాట్లాడుదువుగాని" అన్నాడు.

---

# రాయలసీమ నిధులు ఏమవుతున్నవి?

ములుగు రాజేశ్వరరావు

రాయలసీమలో క్షామం సంభవించిందనగానే అనేక సంస్థలు సహాయం చేయ సంకల్పించటం హర్షించదగ్గ విషయం. ఇటువంటి కార్యాలు ప్రభుత్వం పూనుకొని నిర్వహించటం సుకరమే అయినా, ప్రజాసహకారం, వివిధ సంస్థల, వ్యక్తుల, సానుభూతీ కూడా అవసరం. సహాయ సంస్థలు అనేకం ఆవిర్భవించటం రాయలసీమ వాసులకు ఆశాజనకంగా తోచింది. ఇలాంటి ఉపద్రవాలను యెన్నింటినైనా సులభంగా అధిగమించగలమని భావించబడింది.

కాని ఒక్కటే విచారించవలసిన విషయం. కరువుపీడితుల పేర సేకరించబడిన "నిధి" సక్రమంగా వినియోగింపబడుతున్నట్లు లేదని అనేకులు అభిప్రాయ పడుతున్నారు. కరువు పేర ధనధాన్యాలు సేకరించటంకన్న, వాటిని సక్రమ పద్ధతులద్వారా సకాలానికి, సద్వినియోగమయ్యేట్లు చూడటం అంతకన్న ఘనకార్యమన్నది అందరూ అంగీకరించేదే. అట్లుగాక క్షామతీవ్రతను, ప్రజల దీనస్థితిని, కల్లోలవాతావరణాన్ని, అవకాశంగా యెంచి, తమ పార్టీ ప్రాబల్యానికి, వ్యక్తుల ప్రచారానికి, పాటుబడే వారి దుర్నీతిని అందరూ గర్హిస్తారు. అట్టివారు ప్రజాహితకార్యం చేస్తున్నామని చాటుకోవడంకన్న నీచం వుండబోదు.

ఏమైనా బాధితులకు సహాయపడేందుకు అర్థబలంతోపాటు అంగబలంకూడా అవసరమే. నేడు కృషిచేయ సంకల్పించిన సంస్థలలో అనేకమైనవాటికి అంగబలం శూన్యంకావటం మన మెరిగిందే! "ఆంధ్ర ప్రభ" ధనం సేకరించగలిగింది. కాని దాన్ని వినియోగించేందుకు రామకృష్ణ మిషన్‌పై ఆధారపడక తప్పలేదు. మిషను సైతం వలసినంతమంది కార్యకర్తలు లేక యితరులను యాచిస్తున్నది. ఈ సందర్భంలో ఆర్. యస్. యస్. వాళ్ల కార్యకర్తలు మిషన్ వారికి తోడ్పతున్నారని చెప్పుకుంటున్నారు. ఇప్పటికి మిషన్ 30 కేంద్రాలు నిర్వహిస్తున్న విషయం మెచ్చదగినది

ఆ తరువాత ప్రశంసింపదగిన కృషి ఆర్. యస్. యస్. రాయలసీమ సహాయతా సమితి వారు చేస్తున్నట్టు తెలుస్తున్నది. వీరుకూడ దాదాపు 35 కేంద్రాలు రాయలసీమలోని వివిధ ప్రాంతాల్లో స్థాపించి గ్రామస్తుల తోడ్పాటుతో సంతృప్తికరంగా నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి ప్రకటన తెలుపుతోంది. ఇవిగాక. నూతులు లోతుచేయడంలాంటి గ్రామ పునర్నిర్మాణ కార్యక్రమాలు సైతం కొనసాగించే తలంపు కలదట. వీరి కృషికి ప్రజా సహకారం పూర్తిగా లభ్యమౌతున్నట్టు కార్యదర్శి హర్షం వెలిబుచ్చారు. సుశిక్షితులైన యువకులు చేతినిండా కలరని చాటుకుంటున్న వారైనా ప్రజలకు సేవచేయ గలరని ఆశించవచ్చును.

ఆ తరువాత ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు